
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 20 ఆగస్టు 2024

దండెంపై దుస్తులు ఆరేస్తుండగా..

- విద్యుత్‌షాక్‌తో భార్యాభర్తల మృతి
- రాఖీ పండగ రోజు బస్వాపురంలో విషాదం



సెమినా



బానోత్ శ్రీను

కారేపల్లి ఆగస్టు 19: రాఖీ పండుగ రోజు కారేపల్లి మండలం బస్వాపురంలో తీవ్ర విషాదం నెలకొంది. దండెంపై దుస్తులు ఆరేస్తూ విద్యుత్‌షాక్‌తో భార్య మృతిచెందగా విగత జీవిగా పడిఉన్న భార్యను పట్టుకొని భర్త కూడా విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బానోత్ సెమినా (35), బానోత్ శ్రీను(40)లు కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ప్రియాంక అనే కుమార్తె ఉంది. ఇటీవలే ఆమెకు వివాహం చేశారు. సోమవారం ఉదయం ఉతికిన దుస్తులను సెమినా ఇంటి ఆవరణలోని ఓ తీగపై ఆరేసేందుకు వెళ్లింది. అయితే ఆ తీగకు విద్యుత్ సరఫరా జరుగుతున్న సంగతి తెలియని సెమినా ఆ తీగపై దుస్తులు ఆరవేయగా వెంటనే విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుస్తులు ఆరేసేందుకు వెళ్లిన భార్య ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమె భర్త శ్రీను బయటికి వెళ్లి చూడగా దండెం వద్ద భార్య విగత జీవిగా పడి ఉంది.

వెంటనే ఏం జరిగిందోనని ఆందోళనతో వెంటనే వెళ్లి భార్యను పట్టుకున్నాడు. దీంతో శ్రీనుకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని పక్కింటి వాళ్లు గమనించి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చిన విద్యుత్ వైరును తొలగించి భార్యాభర్తలను ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ మృతి చెందిన్నట్లు తెలిపారు. శ్రీనుకు మొదట వివాహం జరగ్గా ఆమె విడాకులు తీసుకోవడంతో ఆ తరువాత ముస్లిం యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ప్రియాంక అనే కూతురు ఉంది. ఇటీవలే ఆమెకు వివాహం చేశారు. రాఖీ పండుగా రోజు భార్యాభర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. సంఘటనాస్థలాన్ని కారేపల్లి ఎస్ఐ రాజారాం సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సీఎం రేవంత్‌కు రాఖీ కడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



ఉప ముఖ్యమంత్రి భట్టికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



ఖమ్మం బాలలసదనంలో కలెక్టర్‌కు రాఖీ కడుతున్న చిన్నారి

ముగిసిన పవిత్రోత్సవాలు

- నేడు నిత్యకల్యాణాల పునఃప్రారంభం
- భక్తిప్రపత్తులతో హయగ్రీవ జయంతి
- భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న కలెక్టర్ జితేష్ పాటిల్



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 19: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. 14న పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిగింది. 15న పవిత్రాదివాసం, 16న పవిత్రారోపణ నిర్వహించారు. శని, ఆదివారాల్లో హోమాలు, వేద పారాయణం నిర్వహించగా సోమవారం పవిత్రోత్సవాలకు పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహాకుంభ ప్రోక్షణ చేశారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకొని విరామం ఇచ్చిన స్వామివారి నిత్యకల్యాణాలను మంగళవారం పునః ప్రారంభించనున్నారు.

భక్తిప్రపత్తులతో హయగ్రీవ జయంతి

రామాలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో హయగ్రీవ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హయగ్రీవస్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు, ప్రసాద నివేదన చేశారు. హయగ్రీవ జయంతిని పురస్కరించుకొని చిన్నారులకు పుస్తకాలు, స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

రామయ్యను దర్శించుకున్న కలెక్టర్

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ సంస్థ బృందం మను, సంకల్పలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ ప్రాశస్త్యాన్ని వైదిక సిబ్బంది వారికి వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బినరసింహారావు ఉన్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను ట్రాన్స్‌కో భద్రాచలం డీఈ జీవన్‌కుమార్ దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా బుధవారం గోదావరిలో శ్రీరామకోటి ప్రతుల నిమజ్జనం నిర్వహించనున్నారు.

'రుణమాఫీ' వెతలకు చెక్

సమస్యల పరిష్కారానికి నేటినుంచి మండల స్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులు లబ్ధిపొందారు. అయితే వివిధ కారణాలతో ఇంకా అనేకమంది అర్హులైన రైతులకు లబ్ధి జరగలేదు. ఇందుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం నుంచి మండలస్థాయిలో ఫిర్యాదులను స్వీకరించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమం వారంరోజులపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఆయా మండల వ్యవసాయాధికారులను నోడల్ అధికారులుగా నియమించారు.



- ఏవో కార్యాలయం, రైతు వేదికల్లో వారంరోజులపాటు నిర్వహణ
- ఇప్పటికే పెద్దసంఖ్యలో ఫిర్యాదుల దాఖలు
- వివిధ రకాల సమస్యలతో మాఫీ పొందని రైతులు
- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వ ఆదేశం
- గట్టెక్కనున్న రైతుల కష్టాలు

ఖమ్మం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రతిరోజు ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మండల ఏవో కార్యాలయం, రైతువేదికల్లో ఏఈవోలతో కలిసి ఏవోలు ఫిర్యాదులు స్వీరించాలి. రుణమాఫీ నిబంధనల ప్రకారం 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9లోపు రూ.2లక్షలలోపు రుణం తీసుకుని మాఫీ కాకుండా ఉంటే ఆ రైతు ఫిర్యాదును పరిశీలించి ఎందుకు రుణమాఫీ జరగలేదో తెలుసుకుని ఆ అవరోధాలను ఏవోలే తొలగించాలి. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లింక్‌కాకపోయినా పేర్లు ఆధార్‌లో ఒకలా, బ్యాంకు అకౌంట్‌లో ఒకలా ఉన్నా వాటిని సరిచేయడం, రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉండి పైన ఉన్న రుణం చెల్లించక పోవడంతో రుణమాఫీ ఆగితే ఆ సొమ్మును జమచేయించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రతిరోజు ఫిర్యాదులను రిజిస్టర్ చేసుకోవడం, సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి సమాచారం అందించడం తప్పనిసరి.

ఇప్పటికే రైతు రుణమాఫీ కాలేదంటూ ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ కేంద్రానికి సుమారు 4వేలపైగా ఫిర్యాదులందాయి. భద్రాద్రి జిల్లాలో సుమారు 872 దరఖాస్తులు వచ్చాయి. ఇవికాకుండా జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి కూడా మరికొన్ని ఫిర్యాదులందాయి. కలెక్టరేట్ స్థాయిలో ఫిర్యాదు చేసిన రైతుల దరఖాస్తులను కూడా మండల



వ్యవసాయాధికారులకు పంపించారు. గతంలో దరఖాస్తు చేసిన రైతులు మళ్లీ తమ ఫిర్యాదులను మండల వ్యవసాయాధికారులకు కూడా చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేదా తమ ఫిర్యాదు ఉందో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో మూడు విడతలుగా 1,15,346 మంది రైతులకు రూ.766.61కోట్లు రుణమాఫీ జరిగింది. ఇందులో లక్ష రూపాయల్లోపు మొదటి విడత 57,858 మంది రైతులకు రూ.258.25 కోట్లు, రెండో విడతలో లక్షన్నరలోపు 33,942 మంది రైతులకు రూ.262.50కోట్లు, మూడో విడతలో 2 లక్షలలోపు 23,546మది రైతులకు 245.86కోట్లు రుణమాఫీ జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 57,983మంది రైతులకు రూ.415.34కోట్లు రుణ మాఫీ చేశారు. ఇందులో మొదటి విడత కింద లక్షలోపు 28,801మంది రైతులకు రూ.136.64 కోట్లు, రెండో విడతలో లక్షన్నరలోపు 17,309 రైతులకు రూ.147.33కోట్లు, మూడోవిడతలో రూ.2లక్షలలోపు 11,873 మంది రైతులకు రూ.131.36 కోట్లు మాఫీ జరిగింది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 1,73,329 మంది రైతులకు రూ.1181.95కోట్లుపైగా రుణమాఫీ జరిగింది. అయితే జిల్లాలో ఆధార్‌కార్డులో పేర్లు తప్పు, బ్యాంకు అకౌంట్లలో ఆధార్ లింకేజీ కాకపోవడం బ్యాంకు అకౌంట్‌లో మరోపేరు, ఆధార్‌లో మరోపేరు ఉండడం తండ్రి పేరులో తేడా ఉండడం, రేషన్‌కార్డులు లింక్‌కాకపోవడం, ఉమ్మడి కటుంబాలుగా ఉండడంతో వేలాదిమంది రైతులు రుణమాఫీకి అర్హత ఉండి కూడా మాఫీ పొందలేకపోయారు. దీనికితోడు కొందరు రూ.2లక్షలు వరకు రుణం తీసుకుంటే వడ్డీతోపాటు అదనపుసొమ్ము కట్టకపోవడంతో కూడా మాఫీ కాలేదు. కొందరు రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవడం, పాతరుణాల రెన్యువల్ సందర్భంగా తేడాలుండడం, పహణీల మీద కొందరు రుణాలు తీసుకొని వాటిని రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. సొసైటీల్లో గతంలో పొందిన పహణీలతో రుణం పొందిన వారికి మాఫీ కాని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో రుణమాఫీ ప్రారంభం నాటి నుంచి ప్రతిరోజు రైతులు మండల వ్యవసాయాధికారుల వద్దకు, జిల్లా కలెక్టరేట్‌కు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఫిర్యాదులు ఇస్తున్నారు. ఇదే తరుణంలో ఏఈవోలు బదిలీ కావడంతో క్షేత్రస్థాయిలో కొంత గరందరగోళం ఏర్పడింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన ఏవోలు, ఏఈవోలే మండలంలో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవడం రుణమాఫీ సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రైతుల దరఖాస్తులు సత్వరం పరిష్కారమైతే సమస్యకు పరిష్కారం లభించనుంది. మండలస్థాయిలో గ్రీవెన్సు ఏర్పాటుచేయడంతో రుణమాఫీ అర్హత ఉన్నవారికి అవకాశం దక్కనుంది. ఫిర్యాదుదారుల్లో అర్హుల, అనర్హుల లెక్కకూడా తేలబోతుంది.

తెగని పంచాయితీ!

కన్నాయిగూడెం రెవెన్యూలో భూ వివాదం

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం ఏపీ సరిహద్దులోని మారుమూల గిరిజన గ్రామమైన కన్నాయిగూడెం రెవెన్యూలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య మూడువేల ఎకరాల సాగుభూమికి సంబంధించి ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న ఘర్షణ ఓ కొలిక్కి రావడం లేదు. ఈ రెండు శాఖలు ఆ భూమి తమదంటే తమదని సంఘర్షణ పడుతుండటంతో ఇరుశాఖల మధ్య అక్కడి రైతులు నలిగిపోతున్నారు. ఆయా భూములకు రెవెన్యూ శాఖ పట్టాలు జారీ చేసినా అటవీశాఖ మాత్రం ఆ భూములు తమవని, వాటిని ఖాళీ చేయాలని హెచ్చరిస్తుండడంతో రైతులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.



- ఏడు దశాబ్దాలుగా అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సంఘర్షణ
- మూడువేల ఎకరాల సాగుభూములకు లభించని మోక్షం
- 580 మంది రైతులకు అసైన్డ్ పట్టాలు
- ప్రభుత్వానికి అందిన జాయింట్ సర్వే నివేదిక
- రైతుల పక్షాన సానుకూల నిర్ణయం తీసుకునే యోచనలో సర్కార్?

అశ్వారావుపేట, ఆగస్టు 19: ప్రభుత్వం తాజాగా ఈ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశలో అడుగులు వేస్తోంది. జాయింట్ సర్వే అనంతరం రైతులకు పట్టాలు జారీ చేసి సాగులో ఉన్న భూమి పూర్తిగా రెవెన్యూ శాఖదేనని, ఆ భూమితో అటవీశాఖకు సంబంధం లేదని రెవెన్యూశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ మేరకు ప్రభుత్వం సంబంధిత రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్టు సమాచారం. త్వరలోనే దీనిపై ప్రభుత్వ చర్యలు ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

580 మంది రైతులు.. 3వేల ఎకరాలు

అశ్వారావుపేట మండలం కన్నాయిగూడెం రెవెన్యూలోని సర్వే నెం.152లో రెవెన్యూ శాఖ పలు దఫాల్లో గిరిజన రైతులకు పట్టాలు జారీ చేసింది. 1960-61, 1976-77, 1977-78లో, 1988-89సంలో, 1993-94లో, 2004-05లో, 2016-17సంవత్సరాల్లో మొత్తం 580మంది రైతులకు 3,213.21 ఎకరాలకు రెవెన్యూశాఖ విడతలవారీగా అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేసింది. రెవెన్యూ శాఖ తమ రికార్డుల్లో ఈ భూమంతా ప్రభుత్వ భూమిగా గుర్తించి సంబంధిత రైతులకు పట్టాలు జారీ చేసింది. ఆయా రైతులు కూడా ఆ భూమిని సాగు చేసుకుంటూనే ఉన్నారు. అయితే ఆ భూమి అటవీశాఖకు సంబంధించిందేనని, ఆ భూముల్లో సాగు చేయొద్దని అటవీశాఖ తరుచూ అభ్యంతరం చెబుతోంది. తమకు రెవెన్యూశాఖ పట్టాలు జారీ చేసిందని, ఆ భూములపై అటవీశాఖకు ఎటువంటి హక్కులేదంటూ రైతులు చెబుతున్నారు. దీనిపై దశాబ్దాలుగా ఘర్షణ జరుగుతూనే ఉంది. ఏటా దుక్కులు దున్నే సమయంలో రైతులకు అటవీశాఖ నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. రైతులు దీనిపై అనేకసార్లు ప్రభుత్వ అధికారుల వద్ద తమ గోడు మొర పెట్టుకుంటూనే ఉన్నారు.

రెండేళ్ల క్రితం మొత్తం భూమిని రెవెన్యూ, అటవీశాఖలు జాయింట్ సర్వే నిర్వహించాయి. కన్నాయిగూడెం సర్వేలో మొత్తం భూమి 25,782.23 ఎకరాలు ఉంది. ఇందులో 151 సర్వే నెంబర్‌లో 642.15 ఎకరాలు, 152 నెంబర్‌లో 25,140.08 ఎకరాలు భూమి ఉన్నట్లు గుర్తించారు. జాయింట్ సర్వే అనంతరం 22,603.01 ఎకరాలు అటవీశాఖదిగా గుర్తించారు. మిగతా 3,213.21 ఎకరాలు రెవెన్యూభూమిగా గుర్తించారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఆర్‌సీ నెం.ఈఎస్/5704/2022 తేదీ.20-01-2022, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, సర్వే అండ్ లాండ్ రికార్డు ప్రొసీడింగ్స్ నెం.ఏ3/08/2022, తేదీ 28-01-2022, అశ్వారావుపేట తహసీల్దార్ ఆర్‌సీ నెం. ఇ/905/207 తేదీ.08-2021, మండల సర్వేయర్, అశ్వారావుపేట తేదీ 29-03-2022 రిపోర్టు ఆధారంగా రెవెన్యూశాఖ జాయింట్ సర్వే రిపోర్టును ప్రభుత్వానికి పంపింది. సర్వేలో గుర్తించిన భూమి పహానీ, ధరణి రికార్డులు, పీపీబీఎస్‌లలో సాగుభూమిగా గుర్తించబడి సంబంధిత రైతుల పేరుతో నమోదైనట్టు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

రైతులకు అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయం..

కన్నాయిగూడెం ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఉన్న మారుమూల గిరిజన గ్రామం. ఉమ్మడి రాష్ట్రంలోనే రైతులకు ఈ పట్టాలు జారీ అయ్యాయి. రాష్ట్ర విభజన తరువాత కన్నాయిగూడెం రెవెన్యూలో సాగులో ఉన్న రైతుల్లో అధికశాతం ఏపీలో ఉన్నారు. వీరంతా 60-70ఏళ్లుగా ఆయా భూముల్లో సాగులో ఉన్నారు. అసైన్‌మెంట్ పట్టాలు కలిగి ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఈ భూముల్లో కొద్దిమంది గిరిజనేతరులు కూడా ఉన్నట్టు సమాచారం. జాయింట్ సర్వే అనంతరం రెవెన్యూభూమిగా గుర్తించిన రైతుల భూములకు అడ్డంకులు తొలగినా చాలామంది రైతులు ఆంధ్రా రైతులు ఉండటంతో కొద్దిపాటి సంశయంతో ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమవుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం మారడంతో మరోసారి ఈ ఫైల్ ప్రభుత్వం ముందుకు వెళ్లింది. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. రైతుల్లో అధికశాతం ఏపీకి చెందిన రైతులుండటంతో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఏదేమైనా దశాబ్దాలుగా రగులుతున్న వివాదానికి ఒక పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం రైతుల్లో కనిపిస్తోంది.



డీఎంహెచ్‌వోగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 19: ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ వరికూటి సుబ్బారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్ బి.మాలతిని కమిషనరేట్‌కు సరెండర్ చేయడంతో ఆమెస్థానంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సుబ్బారావును నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుబ్బారావును ప్రోగ్రాం అధికారులు, కార్యాలయం సిబ్బంది ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. టీఎన్జీవో నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, గుంటుపల్లి శ్రీను తదితరులు డీఎంహెచ్‌వోను కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.



ఫొటోగ్రఫీ పోటీల్లో సంపత్ ప్రతిభ

రాష్ట్రస్థాయిలో రెండు బహుమతుల కైవసం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఐదు విభాగాల్లో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ఖమ్మానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ చావా సంపత్‌కుమార్ తీసిన ఫొటోలు మహాలక్ష్మి, రైతు భరోసా రెండు విభాగాల్లోనూ రాష్ట్రస్థాయి అత్యుత్తమ ప్రతిభా పురస్కారం, మెమెంటోలు లభించాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వందలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సంపత్ కుమార్ అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చావా సంపత్‌కుమార్‌ను పలువురు ప్రముఖులు ఫొటోగ్రఫీ సభ్యులు అభినందించారు.



ముస్తాబైన రామదాసు ధ్యాన మందిరం

- రూ.3 కోట్లతో అభివృద్ధి పనుల పూర్తి
- రేపు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి ?
- ఆరేళ్ల క్రితం మంత్రి తుమ్మల శంకుస్థాపన

6



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

జవాబుదారీతనంతో పనిచేయాలి

- విధినిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే చర్యలు
- పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
- తిరుమలాయపాలెంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


మధిరలో రాఖీ ఆకారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు


వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు రాఖీ కడుతున్న సీతక్క


15వ బెటాలియన్ కమాండెంట్ ఛటర్జీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారిలు


ముదిగొండలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న మహిళలు


పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు రాఖీ కడుతున్న సీతక్క

శిథిల కార్యాలయం

- కురుస్తున్న ఈజీఎస్ భవనం
- తడుస్తున్న రికార్డులు
- ఒకే గదిలో ఉద్యోగుల అవస్థలు
- అందుబాటులోకి రాని కొత్త భవనం


కురుస్తున్న కార్యాలయ కప్పు


తడవకుండా ఫైళ్లపై పరదాలు


కురిసే నీటి కోసం బకెట్లు

మధిర, ఆగస్టు 19: మధిర పట్టణంలోని ఈజీఎస్ కార్యాలయం వర్షానికి కురుస్తోంది. నాలుగు దశాబ్దాలనాటి మండలపరిషత్ శిథిల భవనంలోని ఒక ఇరుకైన పాత గదిలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. వర్షాలకు గోడలు చెమ్మదిగి నల్లగా రంగుమారాయి. కరెంట్ బోర్డులు షాక్‌ఇస్తున్నాయి. అప్పుడప్పుడు కరెంట్ వైర్లుకాలి నిప్పురవ్వలు వస్తున్నాయి. స్లాబ్ నుంచి కురుస్తున్న వర్షపు నీటికి ఫైళ్లు, బీరువాలు, ఫర్నీచర్ అంతా తడిసిపోతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు ఉద్యోగులు పరదాపట్టాలు కప్పుతున్నారు. బీరువాలైతే వర్షపు నీటికి తడిసి తుప్పుపట్టిపోయాయి. కరెంటు ఉన్నా షాక్ వస్తుండటంతో స్విచ్‌లు వేసేందుకు ఉద్యోగులు బయపడిపోతున్నారు.

బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు విధులు

ఈ కార్యాలయంలో ఒక ఏపీవో, ఈసీ ఒకరు, టెక్నికల్ అసిస్టెంట్లు 5గురు, సీవోలు ఇద్దరు, అటెండర్ ఒకరు ఉన్నారు. వీరు కాకుండా మండలంలోని 27గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 16మంది ఫీల్డుఅసిస్టెంట్లు ఇదే ఆఫీసులో పనులు చేసుకోవాల్సిందే. నిత్యం వివిధ పనులకోసం గ్రామాల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. ఉన్నది రెండే గదులు. అందులో ఒకదాంట్లో బీరువాలు, ఫైల్స్ బద్రపర్చారు. తడవకుండా పట్టాలు కప్పడంతో వాటికే సరిపోయింది. ఇంకో గదిలో ఇద్దరు మాత్రమే కూర్చొనేందుకు వీలుఅవుతుంది. అంతకు మించి ఎవరైనా వస్తే నిలబడాల్సిందే. కనీస ఫర్నీచర్ కూడా సరిగా లేదు. వర్షానికినానిపోయి ఉన్న గోడలు ఎప్పుడు కూలుతాయోతెలియదు. ఈస్థితిలో ఉద్యోగులు దినదిన గండం నూరేళ్లఆయుస్సులాగా విదులు నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయల పనులు అన్ని పంచాయతీల్లో ఈ శాఖద్వారానే అమలౌతుంటాయి. కాని ఆశాఖ ఉద్యోగులకు కార్యాలయం లేకుండా పోయింది.

ఉపయోగంలోకి రాని కొత్తభవనం

విజయవాడకు వెళ్లే దారిలో 25లక్షలతో స్త్రీ శక్తి భవనం నిర్మించారు. ఇది నిర్మాణం పూర్తయి నాలుగు సంవత్సరాలు అవుతుంది. కరెంట్ సదుపాయం ఇవ్వలేదు. నీళ్లు పడలేదని అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణ సమయంలో నీటి సమస్యపై ఏంచేశారో తెలియదు. ఏవో కుంటిసాకులతో ఈభవనం నిర్మాణం పూర్తయినా ఉపయోగంలోకి తీసుకురాలేదు. జిల్లా అధికారులు పట్టించుకొని ఈజీఎస్ కార్యాలయాన్ని అందులోకి తరలిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. లేదా మరేదైనా ప్రభుత్వ భవనం ఈజీఎస్‌కు కేటాయించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మేల్కోకుంటే కురుస్తున్న వర్షాలకు విలువైన రికార్డులన్నీ తడిసి పాడయ్యే ప్రమాదం ఉంది. అంతేకాక తరుచూ విద్యుత్ షాక్ వస్తుండటంతో ఎప్పుడైనా షార్టు సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందోనని ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే కొన్ని చోట్ల అప్పుడప్పుడు వైర్లు షార్టు అయి నిప్పురవ్వలు వస్తున్నాయి. ముందు గదిలోని పైన సీలింగ్ కూడా కరెంట్ వైర్లనుంచి వచ్చిన మంటలతో కాలిపోయింది. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉద్యోగులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

రోడ్ల పాట్లు

- శంకుస్థాపనలు చేసి 5 నెలలు
- ప్రారంభం కాని నిర్మాణ పనులు
- తీవ్ర జాప్యంతో ప్రజల ఇక్కట్లు

జూలూరుపాడు, ఆగస్టు 19: రహదారుల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రాకపోకలను సాగించటానికి ఎన్నో ఏళ్లగా అవస్థలు పడుతున్నారు. వారి ఇబ్బందులను తొలగించాలని సంకల్పించి గత ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకి నిధులను మంజూరు చేసింది. దీంతో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయటంతో ఇక త్వరలోనే తమ ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు భావించారు. కాగా శంకుస్థాపనలు చేసి 5 నెలలు గడిచినప్పటికి నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోకపోవటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహదారులు సక్రమంగా లేకపోవడంతో ఆదివాసీలు ప్రయాణాలు సాగించటానికి నరకయాతన అనుభవిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని అనంతారం నుంచి నల్లబండబోడు గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ఏళ్ళగా తమ గ్రామానికి బీటి రహదారిని నిర్మించాలని ఆదివాసీలు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటిడిఏ ద్వారా అనంతారం నుంచి నల్లబండబోడు వరకు బీటి రహదారి నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ కింద రూ. 2.50కోట్ల నిధులను మంజూరు చేసింది. జూలూరుపాడు నుంచి పాపకొల్లు గ్రామం వరకు మూడున్నర కిలోమీటర్ల మేర డబల్ రహదారి నిర్మాణానికి రూ. 5కోట్ల నిధులను మంజూరు చేసింది. వీటి నిర్మాణ బాధ్యతలు ఆర్‌ఎండ్‌బీకి అప్పగించింది. నిధులు మంజూరు అయినప్పటికి నిర్మాణాలలో జాప్యం జరుగుతుండటంతో తమ కష్టాలు ఎప్పుడు తీరతాయోనని ప్రజలు అంటున్నారు.

5 నెలల క్రితం శంకుస్థాపనలు..

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరి కావడంతో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు వైరా ఎమ్మెల్యే రహదారుల నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రజల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాగా శంకుస్థాపనలు చేసి 5 నెలలు గడిచిన ఇప్పటి వరకు రహదారుల పనులను ప్రారంభించకపోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా సంబంధిత శాఖల అధికారులు చేప్పడంలేదని ప్రజలు అంటున్నారు. ఇటీవలే నల్లబండబోడు రహదారికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఇంకా జూలూరుపాడు నుంచి పాపకొల్లు డబల్ రహదారికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇంకా ఎన్నాళ్లు ఇలా అవస్థలు పడుకుంటా ప్రయాణాలను సాగించాలని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన నియోజకవర్గ ప్రజాప్రతినిధి, అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి రహదారుల నిర్మాణా పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.


జూలూరుపాడు-పాపకొల్లు మధ్య డబుల్ రోడ్డు పనులు ప్రారంభంకాని దృశ్యం


అనంతారం-నల్లబండబోడు గ్రామాల మధ్య రహదారి దుస్థితి

తగిన చర్యలు తీసుకుంటాం..

ఈ విషయమై ఐటీడీఏ ఏఈ ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఏఈ శివగణేష్ మాట్లాడుతూ నల్లబండబోడు, పాపకొల్లు గ్రామాల వరకు రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టెండర్ల ప్రక్రియలు ఆలస్యం కావడంతోనే పనులు ప్రారంభంలో కొంతమేర జాప్యం జరిగిందన్నారు.

గిరిజన హస్త కళలను బాహ్య ప్రపంచంలోకి తేవాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్


గిరిజన మ్యూజియంలో కళాకృతులను పరిశీలిస్తున్న కలెక్టర్, అహ్మదాబాద్ బృంద సభ్యులు

భద్రాచలం, ఆగస్టు 19: గిరిజన హస్త కళలను బాహ్య ప్రపంచంలోకి తెచ్చి దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న ప్రైవేటు మాల్స్‌లో ప్రదర్శించేలా మెళకువలు, అవగాహన కల్పిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అన్నారు. భద్రాచలంలోని గిరిజన మ్యూజియంలోని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల తీరు, ఆహారపు అలవాట్లను అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ ఇనిస్టిట్యూషన్‌కు చెందిన సభ్యులు సంకల్ప, మను బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ గిరిజనులు తరతరాలుగా తమ శ్రమనే నమ్ముకొని జీవిస్తున్నారని జొన్న, గటక, రాగి సంకటి వంటి బలవర్ధకమైన ఆహారం తీసుకుంటారని బృందం సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, ఆర్‌ఐ నరసింహారావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై అన్ని మండలాల్లో ప్రజావాణి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ అంశంపై ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 డిసెంబరు12 నుంచి 2024 ఆగస్టు 15 వరకు రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారిలో రుణమాఫీ కానీ వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 23 మండలాల్లో వ్యవసాయ అధికారులు ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రైతురుణమాఫీపై ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏదైన వ్యవసాయ శాఖ సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

వ్యవసాయశాఖ అధికారుల బదిలీ

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 19: ఖమ్మం జిల్లాలో వివిధ డివిజన్లలో పనిచేస్తున్న వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ)అధికారుల బదిలీలు జరిగాయి. హైదరాబాద్ నుంచి కౌన్సిలింగ్ ద్వారా కమిషనర్ ఆధ్వర్యంలో వారికి బదిలీలు చేపట్టారు. సోమవారం రాత్రి వరకు బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. మల్టీ జోనల్ పరిధిలో జరిగిన బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి .

ఏడీఏ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి సరిత	ఖమ్మం జేడీఏ ఆఫీస్	కూసుమంచి
నాగేశ్వరరావు	సత్తుపల్లి	కొత్తగూడెం
వి శ్రీనివాసరెడ్డి	ఖమ్మం, జేడీఏ ఆఫీస్	సత్తుపల్లి
కె స్వరూపరాణి	ఎస్టీఎల్ ల్యాబ్	ఎస్టీఎల్ ల్యాబ్
కె వెంకటేశ్వరరావు	మధిర	ఖమ్మం అర్బన్
ఏ శ్రీనివాసరావు	ఖమ్మం అర్బన్	మహబూబాబాద్
ఎస్ విజయచంద్ర	కూసుమంచి	మధిర
పి వాసవీరాణి	ఇల్లెందు	ఖమ్మం జేడీఏ ఆఫీస్
టి కరుణశ్రీ	వైరా	వైరా

ఫొటోగ్రఫీలో షరీఫ్ మెరుపులు

రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం

భద్రాచలం, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫొటో పోటీల్లో గృహజ్యోతి విభాగంలో భద్రాచలానికి చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎస్‌కేఏ షరీఫ్ తీసిన ఫొటోకు ద్వితీయస్థానం దక్కింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ద్వితీయస్థానం దక్కిన భద్రాచలానికి చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎస్‌కేఏ షరీఫ్‌కు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షరీఫ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గతంలో సైతం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అవార్డులు, ప్రశంసలు, ప్రోత్సాహకాలు షరీఫ్‌కు దక్కాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటి నుంచి బహుమతి అందుకుంటున్న షరీఫ్


శ్రీంగేరి పీఠాధిపతి నుంచి బహుమతులు స్వీకరించిన మాలిని, నీలిమ

భళా.. మహిళలు

- జాతీయస్థాయి భగవద్గీత పోటీల్లో ప్రథమం

తల్లాడ, ఆగస్టు 19: కర్ణాటకలోని శ్రీంగేరి పీఠం ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో తల్లాడకు చెందిన మహిళలు గుర్రం మాలిని, జవ్వాజి నీలిమ అత్యుత్తమ ప్రతిభ కనపరిచి ప్రథమశ్రేణిలో నిలిచారు. ఘనాపాటిల సమక్షంలో భగవద్గీతలోని 18అధ్యయాల్లోని 700శ్లోకాలను కంఠస్థంగా పఠనం చేసి మాలిని, నీలిమ ప్రతిభ చాటుకున్నారు. ప్రథమ శ్రేణిలో నిలిచిన మాలిని, నీలిమకు పీఠాధిపతి విధుశేఖరా భారతి మహాస్వామి ప్రశంసాపత్రాలు, రూ.25వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. గత ఏడాది జూన్ 23న మైసూర్‌లో దత్తపీఠం ఆధ్వర్యంలో జరిగిన దక్షిణ భారతస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో కూడా మాలిని, నీలిమ పాల్గొని ప్రతిభ చాటుకొని గణపతి సచ్చితానందస్వామి నుంచి బహుమతులు అందుకున్నారు. జాతీయస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో ప్రతిభ కనపర్చిన మాలిని, నీలిమలను ఎస్‌ఎస్‌వై వ్యవస్థాపకుడు ప్రేమ్‌నిరంతర్ మల్లేష్‌గురూజీ, దారా విష్ణుమోహన్‌రావు, నంబూరి మోహన్‌రావు అభినందించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఖమ్మం రూరల్, ఆగస్టు 19: మండలంలోని గూడురుపాడు, తనగంపాడు, కాస్నాతండా, తదితర గ్రామాల్లోని రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం తీరును ఢిల్లీ నుంచి వచ్చిన టెక్నికల్ బృందం సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లో బియ్యం నాణ్యతను పరిశీలించారు. ప్రతి నెల ప్రజలకు అందిస్తున్న బియ్యం నాణ్యంగా ఉంటున్నాయా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల్లో స్టాకును పరిశీలించారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహార బియ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఎఫ్‌సీఐ గోడౌన్ ఇన్‌చార్జ్ చత్రసింగ్, టెక్నికల్ టీం ఇన్‌చార్జ్ రామచంద్రరావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

- విధినిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే చర్యలు
- పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- తిరుమలాయపాలెంలో 'ప్రజావాణి' తనిఖీ


తిరుమలాయపాలెంలో పర్యటిస్తున్న కలెక్టర్

తిరుమలాయపాలెం, ఆగస్టు 19: ప్రజలకు అధికారులు బాధ్యతగా జవాదారితనంతో పనిచేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం తిరుమలాయపాలెం, మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రజావాణిలో అధికారుల హాజరును పరిశీలించారు. మండలంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు విధిగా పాల్గొనాలని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు దరఖాస్తుల పరిష్కరించాలని కోరారు. తిరస్కరించిన దరఖాస్తుకు గల కారణాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణికి ఆలస్యంగా హాజరైన ఎంపీడీవో సిలార్‌ను ఎందుకు ఆలస్యంగా వచ్చారని అడిగారు.

తిరుమలాయపాలెం పంచాయతీ కార్యదర్శి సునీత విధులకు గైర్హాజరు పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే మండలంలో ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందని ఏవో సీతారామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రెండులక్షల పైబడినవారు ఎంతమంది ఉన్నారని, వారి వివరాలు సేకరించాలన్నారు. రుణమాఫీపై రైతుల్లో అవగాహన చేపట్టాలని రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు తనిఖీచేయాలని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేవిధంగా చూడాలన్నారు.

ఈ సందర్భంగా తిరుమలాయపాలెంలోని తెలంగాణ ఆగ్రో ఏజెన్సీని ఆయన తనిఖీచేశారు. ఎరువుల, పురుగుమందుల స్టాక్ వివరాలు, విత్తనాల అమ్మకం గురించి రిజిస్టర్లు తనిఖీచేశారు. అనంతరం తిరుమలాయపాలెం వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రిని ఎంపీడీవో కార్యాలయం నుంచి కాలినడకన వెళ్లి తనిఖీచేశారు. రోగులకు అందిస్తున్నసేవలగురించి సూపరింటెండెంట్ కృపా ఉషశ్రీని అడిగి తెలుసుకున్నారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు రాకుండా వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలు వ్యాప్తి చెందవని, వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఏపీఎం అలివేలుమంగ, సీసీ కొండబాల సావిత్రి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, డీటీ నరసింహారావు, ఏవో సీతారాంరెడ్డి, ఆర్‌ఐలు వీరన్న, లహరి, వైద్యులు వసుంధర, అలివేలు, బొల్లికొండ శ్రీనివాసరావు సూరజ్ పాల్గొన్నారు.

ముస్తాబైన రామదాసు

ధ్యాన మందిరం

- రూ.3కోట్లతో అభివృద్ధి పనుల పూర్తి
- 21న ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, ఆగస్టు 19: నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరానికి మహర్దశ పట్టనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్లు, భవనాల శాఖా మంత్రిగా ఉన్న, ప్రస్తుత వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భక్తరామదాసు ధ్యానమందిరం అభివృద్ధికి దాదాపు రూ.3 కోట్లను మంజూరు చేయించారు. అభివృద్ధి పనులకు 2018 జనవరి 21న శంకుస్థాపన చేశారు. తుమ్మల మంత్రిగా ఉన్నంత వరకు పనులు వేగంగా జరిగాయి. అనంతర కాలంలో పనుల్లో వేగం తగ్గింది. దాదాపుగా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. తిరిగి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రామదాసు ధ్యానమందిరం అభివృద్ధి పనుల్లో మళ్లీ వేగం పెరిగింది. ధ్యానమందిరం ఆవరణలో అత్యంత అధునాతన హంగులతో నిర్మిస్తున్న ఆడిటోరియం నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ధ్యానమందిరంలో అభివృద్ధి పనులు ప్రారంభమై దాదాపుగా ఏడేళ్లు కావొస్తోంది. ఇద్దరు, ముగ్గురు కాంట్రాక్టర్లు మారిన అనంతరం ధ్యానమందిరం ఆవరణలోని ఆడిటోరియం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈనెల 21న ప్రారంభించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆడిటోరియాన్ని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా ధ్యానమందిరం అభివృద్ధికి కేటాయించిన నిధుల్లో సింహభాగం ఆడిటోరియం నిర్మాణానికి ఖర్చు చేశారు. అత్యంత అధునాతనమైన హంగులతో ఆడిటోరియం నిర్మాణం జరిగింది. ఆడిటోరియం లోనకు వెళ్లగానే భక్తరామదాసు జీవిత చరిత్ర కళ్లకు కట్టినట్టుగా ఆడిటోరియం గోడలపై తైలవర్ణ చిత్రాలను వేయించారు. ఆడిటోరియంలో కళాప్రదర్శనలు జరిగినప్పుడు, కళాకారులకు అవసరమయ్యే గ్రీన్‌రూంలను నిర్మించారు. అయితే ధ్యానమందిరం, ఆడిటోరియంల చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాల్సి ఉంది. దీంతోపాటు ఆడిటోరియంలో సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.


రామదాసు జీవితచరిత్రను తెలిపే తైలవర్ణ చిత్రాలు

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

- జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ రమణయ్య


వేదికపై ప్రొఫెసర్ రమణయ్య, తదితరులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు19: ఒక ప్రణాళికాబద్ధంగా నాలుగేళ్ల పాటు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడం ద్వారా మల్టీనేషనల్ కంపనీలలో ఉద్యోగ అవకాశాలు సంపాదించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డా.జేబీవీ రమణయ్య అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డైరెక్టర్లు డా.కందిమళ్ల కృష్ణారావు, కొత్తూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 19: ఓటరు జాబితా సవరణ 2025 రూపకల్పనకు చర్యలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లతో ఓటరు జాబితా సవరణ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణకు పెండింగులో ఉన్న ఫారం 6, 6ఏ, 7, 8 లను తహసీల్దార్లు ఆన్‌లైన్ లో పొందుపరచాలన్నారు. క్షేత్ర పరిశీలనకు బీఎల్‌వోలకు అందుబాటులో ఉంచాలన్నారు. దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనకు రోజువారి లక్ష్యం పెట్టుకొని పర్యవేక్షణ చేయాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు.



భళా.. అగ్రికల్చర్ పాలిటెక్నిక్

- వ్యవసాయ రంగంలో మెళకువలతోపాటు ఉపాధి కల్పిస్తున్న విద్యాసంస్థ
- రెండేళ్ల డిప్లామా కోర్సుల్లో ప్రతీ ఏటా ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లాలో ఏకైక ప్రభుత్వ కళాశాలగా గుర్తింపు

మధిర, ఆగస్టు 19: వ్యవసాయ రంగంలో సాంకేతిక మెలకువలను నేర్పుతూ ఎందరో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది మధిరలోని ప్రభుత్వ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఏకైక వ్యవసాయ సాంకేతిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇది. 2011-12 సంవత్సరంలో ఉమ్మడి ప్రభుత్వంలో మధిర వ్యవసాయ పరిశోధనా స్థానానికి అనుబంధంగా ఈ కళాశాలను కో ఎడ్యుకేషన్‌తో ఏర్పాటు చేశారు. ఇందులో రెండేళ్ల డిప్లొమా కోర్సులు 44సీట్లు ఉంటాయి. ప్రథమ సంవత్సరం 22మంది, ద్వితీయ సంవత్సరం 22మంది కోర్సు అభ్యసిస్తారు. పదోతరగతి తర్వాత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులకు, పదోతరగతి తత్సమాన విద్యార్హత కలిగిన మెరిట్ విద్యార్థులకు ఈకోర్సులో ప్రవేశం కల్పిస్తారు. సీటు కేటాయింపు హైదరాబాద్‌లోనే అగ్రిసెట్ ద్వారా జరుగుతుంది. ఖాళీలను స్పాట్ కౌన్సిలింగ్‌లో భర్తీ చేసేటప్పుడు టెన్త్ మెరిట్ ఆధారంగా కూడా తీసుకుంటారు. ప్రస్తుతం ఎంపికలు జరుగుతున్నాయి.

మధిరలో వ్యవసాయ పరిశోధనా స్థానంకు అనుబంధంగా ఉండటం ఇక్కడి మరో ప్రత్యేకత. ఈ పరిశోధనా స్థానం 50 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. క్షేత్రంలోనే విద్యార్థులు విత్తనం విత్తడం దగ్గర నుంచి కలుపు, పంట కోతల వరకు ప్రత్యక్షంగా పాల్గొని అనుభవం ద్వారా నేర్చుకుంటారు. ఇందులోని శాస్త్రవేత్తలే విద్యార్థులకు నేరుగా విద్యాబోధన చేస్తారు. రాష్ట్రంలోనే మధిర విద్యార్థులు ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించారు.

ఉద్యోగ అవకాశాలు

ఈకళాశాల ఏర్పాటైన దగ్గర నుంచి ఇప్పటివరకు 304మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరిలో 34మంది వ్యవసాయ విస్తరణాధికారులుగా (ఏఈవో) కొలువులు సాధించారు. మరికొంత మంది వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. ఇంకొంత మంది ఉన్నత చదువులలో చేరి అభ్యసిస్తున్నారు. రెండేళ్ల పాలిటెక్నిక్ కోర్సు పూర్తైన తర్వాత అగ్రిసెట్ ద్వారా అగ్రికల్చరల్ బీఎస్సీ వంటి కోర్సులలో చేరేందుకు అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఏకైక కళాశాల

రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలోనే ఏకైక కళాశాల ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి ప్రతి ఏడాది 1,100మంది విద్యార్థులు ఈ కోర్సు పూర్తి చేస్తున్నారు. అగ్రికల్చరల్ బీఎస్సీలో చేరేందుకు 60సీట్లు ఉండగా, అందులో ప్రవేశానికి అగ్రిసెట్ ద్వారా అవకాశం ఉంటుంది. గత మూడేళ్లుగా మధిర కళాశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబర్చి మంచి ర్యాంకులు పొందుతున్నారు. రాజేంద్రనగర్‌తోపాటు, వరంగల్, అశ్వారావుపేటలలోని వ్యవసాయ డిగ్రీ కళాశాలలో సీట్లు పొందారు. గత ఏడాది 20మంది విద్యార్థులకు గాను 9మందికి బీఎస్సీలో సీట్లు లభించడం ప్రత్యేకం. ఎన్. సాయికృష్ణ అనే విద్యార్థి గత ఏడాది రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించి ప్రత్యేకతను చాటాడు. ప్రస్తుతం ఈ కోర్సును ఇంటర్‌మీడియట్‌కు సమానంగా చేసినందున అగ్రిసెట్‌లో సీటు లభించని వారు నేరుగా డిగ్రీలోని సైన్సు విభాగం బీఎస్సీ లో చేరి చదువుకునే వెసులుబాటుకూడా ఉంది.


క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థుల భవిష్యత్, ప్రయోజనాలకనుగుణంగా బోధన

● రుక్మిణీదేవి, ప్రిన్సిపాల్



కళాశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారి భవిష్యత్ ప్రణాళిక, అనుకున్న ఆశయాలు సాధించడానికి కావాల్సిన శిక్షణ ఇస్తున్నాం. పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్ల వంటి సస్యరక్షణ అంశాలు, అధిక దిగుబడులు సాధించటానికి అధునాతన సాంకేతిక అంశాలు బోధిస్తూనే. పంట క్షేత్రంలో వారితోనే ఇవన్నీ అమలుచేయిస్తాం. అధ్యాపకుల అందరి కృషి సమగ్ర శిక్షణతో, ప్రణాళికా బద్ధమైన నిర్వహణతో అగ్రిసెట్‌లో మంచి ర్యాంకులతోపాటు ఏఈవో ఉద్యోగాలు సాధిస్తున్నాం. వ్యవసాయం పట్ల మక్కువ పెరిగేలా చేయడం ద్వారా భవిష్యత్‌లో మంచి పౌరులుగా, శాస్త్రవేత్తలుగా, సమర్థ అధికారులుగా రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుంది.

హాస్టల్ సదుపాయం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు మధిరలో మంచి వసతి సదుపాయం ఉంది. బాలురకు, బాలికలకు వేర్వేరుగా భవనాలు నిర్మించి హాస్టల్ సదుపాయం కల్పించారు. అన్ని వసతులతో విద్యార్థులకు సదుపాయాలు కల్పించారు.

బోధనా సిబ్బంది

మధిరలో కళాశాల ఏర్పాటుచేసి 13సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు బోధనా సిబ్బందిని కేటాయించలేదు. అధ్యాపకులులేకపోయినా ఉన్న అరకొర శాస్త్రవేత్తలే కాంట్రాక్ట్ సిబ్బందిని తీసుకొని బోధన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బోధనా సిబ్బంది పోస్టులు కేటాయించి నియమిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించడం జరుగుతుందని వ్యవసాయరంగంలో నిష్ణాతులను తయారు చేయడం జరుగుతుందని విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు ప్రభుత్వాన్ని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నారు. ఈప్రాంతంలో ఆర్గానిక్ వ్యవసాయం విస్తరణకు ఈ కళాశాల తోడ్పడుతుందని తెలుపుతున్నారు.

ఫిర్యాదులపై నివేదికలు సిద్ధం చేయాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు19: ప్రజావాణి దరఖాస్తులను ప్రతి వా రం సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ఏటీఆర్ నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో అర్జీదారుల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలల్లో ప్రజావాణి దరఖాస్తులు 216 పెండింగ్‌లో ఉన్నాయి.. ఈ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

మాన్యువల్ పహాణీపై 90వేలు రుణాన్ని తీసుకున్నా. పట్టా పుస్తకం లేదని కారణంతో నాకున్న రుణాన్ని మాఫీ చేయలేదు. దీంతో అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న. కనీసం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నా రుణాన్ని మాఫీ చేయాలని కొత్తలింగాలకు చెందిన గంధం వెంకటయ్య పిర్యాదు చేశాడు.

లక్షలోపు వ్యవసాయ రుణాన్ని తీసుకున్న కిన్నెర బ్యాంకు ఖమ్మంలో తీసుకున్న. రుణమాఫీకి అన్ని అర్హతలున్నప్పటికీ నాకు మాఫీ కాలేదు. అదేమంటే టెక్నికల్ ఇష్యూ అంటున్నారు. ఇప్పటికైనా తన విషయమై విచారించి న్యాయం చేయాలని లచ్చగూడెం గ్రామానికి చెందిన పోట్ల సీతయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన పాశం సైదులు, తనకు సర్వే నెం 277 లో గల భూమిని, తన ప్రమేయం లేకుండా 278 గల సర్వే నెం.తో రిజిస్ట్రేషన్ చేయించుకొని, తనను భూమిలో సాగు చేసుకోనివ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరాడు.

- నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామస్తులు, నేలకొండపల్లి రెవెన్యూ గ్రామం ముజ్జుగూడెం శివారులో ఉన్న బౌద్దస్తూపంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అండతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

దుమ్ముగూడెం, ఆగస్టు19: పెదబండిరేవు, పెదనల్లబల్లి గ్రామకూడళ్లలో సోమవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరిట పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు పేలి వెంకటాపురం మండలం చొక్కాలకు చెందిన ఆదివాసీ మహిళ, పశువుల కోసం అడవికి వెళ్లిన సుక్మా జిల్లా దబ్బమరకకు చెందిన మరో ఆదివాసీ మహిళలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజలకు మావోయిస్టుల వలన ఎటువంటి ప్రయోజనం లేదని, పైగా వారి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. నిజనిర్ధారణ పేరుతో ఆందోళన చేసే ప్రజా సంఘాలు ఆదివాసీ హక్కుల సంఘాలు నోరు తెరిచి ఆదివాసీలకు అండగా ఉండాలని కోరారు.

ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఐటీసీ హెచ్‌ఆర్ జీఎం శ్యామ్‌కిరణ్


మాట్లాడుతున్న ఐటీసీ హెచ్‌ఆర్ జీఎం శ్యామ్‌కిరణ్

బూర్గంపాడు,ఆగస్టు 19: ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల భాషలు అంతరించిపోతున్నాయని వాటిని పరిరక్షించుకుని సంప్రదాయ, సాంస్కృతిక పందనపు కాపాడుకోవాలని ఐటీసీ హెచ్‌ఆర్ జీఎం శ్యామ్‌కిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోయగూడెం రైతువేదికలో ఇండిజినెస్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ముఖ్య నిర్వహకులు పాయం రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కోయభాష వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోయతర్జుర్‌బాట వ్యవస్థాపకుడు గంగాదేవి యాదయ్య, అడ్మిన్ మేనేజర్ చెంగళరావులతో కలిసి మాట్లాడారు. తొలుత కోయభాషలో సాహిత్యంపై పాత్ర, బాల సాహిత్యం ఆవశ్యకత, బాలసాహిత్యం తయారు అనే అంశాలపై గిరిజన ఆదివాసీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సాహిత్యరుపాల్లో ఉంటేనే భాష సజీవంగా ఉంటుందని, మొదటి బాలసాహిత్యం తయారు చేయాలని, కోయభాష కవులు, రచయితలు తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంగ్లీష్, హిందీ భాషలకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో ...కోయభాషకు అంతే ప్రాధాన్యత ఇచ్చి ఆచార, సంప్రదాయాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సహ వ్యవస్థాపకుడు పాండు కమ్టేకర్, ఐటీడీఏ ప్రాజెక్టు మానిటరింగ్ అధికారి తెల్లం రమణయ్య, కోయతర్జుర్ బాట వాలంటీర్ తెల్లం కృష్ణ, సత్యనారాయణ, పాయం వెంకటరత్నం, డోలీ కళా బృందం సకినం శ్రీనివాస్, ఆదివాసీ కవయిత్రి బృందం కుంజా నాగలక్ష్మి, పూనెం ఇషాంత్, సోడే శ్రీరాములు, మడకం భారతి, సోడె మురళి, పూసం శ్రీను, వాలం టీర్లు బొర్రా రమేష్, గుండె అంజలి, సోడె శ్రీను పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

పాల్వంచ టౌన్, ఆగస్టు 19: వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ప్రయివేట్ ఆస్పత్రులను, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు, రక్తపరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డెమో పై జీమోహియుద్దీన్, పీవో డాక్టర్ బాలాజీనాయక్ ఉన్నారు.

పాల్వంచలో జరిగిన అవినీతి పై దర్యాప్తు చేపట్టాలి

- టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల


సమావేశంలో మాట్లాడుతున్న అనంతరాములు

పాల్వంచ టౌన్, ఆగస్టు 19: పాల్వంచ మునిసిపాలిటీలో గతంలో జరిగిన కోట్లాది రూపాయలు అవినీతిపై దానికి బాధ్యులైన అధికారులపై ఉన్నతస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. హరితహారంలో నాటి కమిషనర్, ఏఈ, డీఈలు బీనామి కాంట్రాక్టర్‌ను సృష్టించి, లక్షల మొక్కలు నాటినట్లు రికార్డులు సృష్టించి భారీస్థాయిలో బిల్లులు పెట్టుకుని సొమ్మును స్వాహా చేశారని ఆరోపించారు. అదేవిధంగా నాటి, ఎమ్మెల్యేలు జలగం వెంకట్రావ్, వనమా వెంకటేశ్వరరావు అధికారం కాలంలో కమీషన్లు ఎవరిస్తే వారికి వారు కోరుకున్న చోట రోడ్లు, డ్రైనేజీలు వంటి సివిల్ వర్క్‌లను కాంట్రాక్టర్లకు అప్పచెప్పి విచ్చలవిడిగా బిల్లులు రికార్డు చేసి అధికారులు దండుకుంటున్నారని తెలిపారు. వీటన్నింటిపై తన వద్ద తగు సమాచారం ఉందన్నారు. వీటన్నింటిపై స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఆధారాలతో సహా నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ద్వారా దీనిపై పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేవిధంగా కృషి చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు బత్తుల దుర్గారావు, నాయకులు చంద్ర రవి, జరబన సాంబశివరావు, సొసైటీ డైరెక్టర్ గంగవరపు సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

● భైరవునిపల్లి గ్రామంలో ఘటన

నేలకొండపల్లి, ఆగస్టు19: ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జువ్వెనబోయిన పుల్లారావు(48) మృతిపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. పుల్లారావు ఆదివారం నుంచి కనబడడం లేదని కొంత మంది చెబుతుండగా, సోమవారం ఉదయం నుంచి కనబడడం లేదని మరి కొందరు చెబుతున్నారు. సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని పొలాల వైపు వెళ్లిన వారికి ఓ రైతు వ్యవసాయ భూమిలో మృతదేహం తేలుతుండగా గుర్తించి బయటకు తీసినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

పాముకాటుతో రైతు...

● లింగంబంజర గ్రామంలో ఘటన


నాగయ్య(ఫైల్)

కారేపల్లి, ఆగస్టు19: పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లింగంబంజర గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంబంజర గ్రామానికి చెందిన మోగిలిచెర్ల నాగయ్య(55) తనకున్న మేకలను మేపేందుకు వెళ్లాడు. కాగా మేకలు గడ్డి మేస్తున్న తరుణంలో వాటికి గడ్డి అందిస్తుండగా పాము కాటు వేసింది. అయితే తనకు ముల్లు గుచ్చుకుందనే భావంతో ఇంటికి వెళ్లి తన కుటుంబ సభ్యులకు ముల్లు గుచ్చుకుందని చెప్పాడు. అంతలోనే అనారోగ్యానికి గురై అపారస్థితిలోకి వెళ్లిన అతడిని గమనించిన కుటంబసభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో చిన్నారులపై వ్యక్తి దాడి

● పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

మధిరరూరల్, ఆగస్టు 19: మధిర మండలం రాయపట్నం గ్రామంలో పల్లెపోగు సిద్దూ అనే యువకుడు మద్యం సేవించి తన ఇంటిపక్కనున్న చిన్నపిల్లలపై దాడికి పాల్పడుతున్నాడని పిల్లల తల్లిదండ్రులు మధిర టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సిద్దూ అనే యువకుడు గత వారం రోజులుగా మద్యం, గంజాయి సేవించి స్థానిక ఎస్సీ కాలనీలోని చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాడని పోలీసులకు చేసిన ఫిర్యాదులో ఆరోపించారు. సిద్దూపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్నపిల్లలపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారి తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వంతెనే వారికి అండ

- దీనంగా బుడబుక్కల, రాజన్న కుటుంబాల జీవనాలు
- దశాబ్దాలుగా గూడుకు నోచుకోని పేదలు


వంతెన కింద నిర్మించుకున్న ఇళ్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 19: ఎండైనా, వానైనా వంతెనే వారికి అండగా నిలుస్తోంది. పది దశాబ్దాలుగా వారు ఖమ్మం నగరంలోనే వంతెన కింద చీరలతో గుడిసెలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఒక ప్రాంతం వాళ్లు వెల్లగొడితే మరో ప్రాంతానికి నివాసాలు మార్చుకుంటూ ఎట్టకేలకు ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్ వంతెన కింద తమ దుర్భర జీవితాలను కొనసాగిస్తున్నారు బుడబుక్కల, రాజన్న కుటుంబాలు వారు. పొట్ట కూటి కోసం చీరలతో బొంతలను కూడుతూ, ప్లాస్టిక్ పూలను అమ్ముతూ జీవిస్తున్నారు.

వందేళ్లకు పూర్వం మహారాష్ట్ర నుంచి కొన్ని కుటుంబాలు జీవనం కోసం ఖమ్మం నగరాన్ని ఆశ్రయించాయి. ఆ కుటుంబాలు పెరుగుతూ ఇప్పుడు ఖమ్మంలో 50కు చేరాయి. 120మందికి పైగా జనాభా పెరిగింది. ప్రతి కుటుంబంలోని వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రేషన్‌కార్డులు మంజూరు జరిగాయి. కేంద్రం నుంచి ఆధార్, ఓటరు గుర్తింపు లభించింది. ఎన్నికల సమయంలోను వారి ఇళ్లకు వెళ్లి రాజకీయ పార్టీలు ఓట్లను అడిగిమరీ తమ పార్టీలకు పోలింగ్ చేయించుకుంటున్నారు.

బుడబుక్కల, రాజన్న కులాలకు చెందిన వీరు ఇంటింటికి వెళ్లి కోరిన వారి ఇంటి నుంచి పాత చీరలను తీసుకొచ్చి బొంతలను కుడుతూ ఒక్కో బొంతకు రూ.100 తీసుకొని జీవనం సాగిస్తున్నారు. రాజన్న కుటుంబాలు మాత్రం ప్లాస్టిక్ పూలు, ఫ్లవర్‌వాజ్‌లు, అలంకరణ సామాన్లు, సోపా కవర్లు అమ్మకాలు చేస్తూ వచ్చిన కొద్ది పాటి డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. ఖమ్మంలోనే పుట్టిన పిల్లలు పెరిగి వివాహాలు చేసుకొని తిరిగి వాళ్ల పిల్లలు వివాహాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రేషన్, పింఛన్లు అందుతున్నాయి. వీరికి నిలువ నీడ ఉండేందుకు సరైన నివాసాలు లేవు. చీరలు, కర్రలతో గుడిసెలను ఏర్పాటు చేసుకొని ఒక్కో గుడిసెలో 2నుంచి 3 కుటుంబాల భార్య భర్తలు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వంతెన కింద వైపు గుడిసెలు ఉండటంతో మహిళలు పగటి పూట స్నానాలు చేసేందుకు ఇబ్బందిగా మారింది. ఉంటున్న చీరల గుడిసెల్లో ఫ్యాన్‌లు పెట్టలేక దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని వారు కోరుతున్నారు.

గిరిజన యువతికి గర్భస్రావం !

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

భద్రాచలం, ఆగస్టు 19: కొద్ది రోజుల క్రితం భద్రాచలంలో ఓ గిరిజన యువతికి గర్భస్రావం అయిన ఘటన వివాదాస్పదంగా మారింది. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు ఈ అంశంపై విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఏపీలోని చింతూరు మండలానికి చెందిన ఓ గిరిజన యువతిని వారం రోజుల క్రితం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, ఆమెను ప్రేమించిన యువకుడి కుటుంబ సభ్యులు తీసుకొచ్చినట్లు సమాచారం. అప్పటికే ఆమె ఆరు నెలల గర్భవతికావడం, గర్భనిరోధక మాత్రలు తీసుకొని అపస్మారక స్థితిలో ఉన్నట్లు వినికిడి. దీంతో సదరు వైద్యశాల వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించగా, పిండం కిందకు జారిందని దాన్ని తీయాలని సూచించినట్లు సమాచారం. వైద్యశాలకు ఆ యువతితో కలిసి వచ్చిన వారి అనుమతి తీసుకొని వైద్యులు ఆ యువతి మృతశిశువును బయటకు తీసినట్లు తెలిసింది. అయితే తనకు గర్భస్రావం కావడానికి తన ప్రేమికుడి కుటుంబసభ్యులు ఈ నెల 10వ తేదీన టాబ్లెట్లు ఇచ్చినట్లుగా సదరు యువతి చెబుతోంది. ఈ క్రమంలో తనకు తీవ్ర నీరసం రావడంతో భద్రాచలంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చేర్పించి గర్భస్రావం చేయించినట్లు ఆమె ఆరోపిస్తోంది. తాను ప్రేమించిన వ్యక్తితో వివాహం చేస్తామని చెప్పి గర్భస్రావం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం భద్రాచలం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ సంజీవరావును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ సాగుతోందన్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారం గురించి బాధిత యువతి మాట్లాడిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

వైరాలో స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

వైరా, ఆగస్టు 19: మండలంలోని గొల్లపూడి-తూటికుంట్ల రోడ్డులో గొల్లెనపాడు క్రాస్‌రోడ్డు వద్ద వైరాకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడింది. వైరా నుంచి గొల్లపూడి, అష్టగుర్తి మీదుగా తూటికుంట్ల వెళ్తున్న మధు విద్యాలయానికి చెందిన ఓ బస్సు గొల్లెనపాడు క్రాస్‌రోడ్డు వద్ద రెండు మోటారుసైకిళ్లను తప్పించే ప్రయత్నంలో రోడ్డుపక్కకు జారిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సులోని విద్యార్థులకు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రూ. 8లక్షలకు దివాలా పిటిషన్ దాఖలు

ఖమ్మం లీగల్, ఆగస్టు 19: ఖమ్మం నగరంలోని శుక్రవారిపేటకు చెందిన మహ్మద్ హమీద్‌అలీ మొత్తం ఐదుగురిని ప్రతివాదులుగా చూపిస్తూ మొత్తం రూ.8,48,378 రూపాయలకు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. దివాళా దారుడు ల్యాబ్‌కు సంబంధించిన వస్తువులను అమ్మడం చేసేవాడు. ఈ వ్యాపారంలో పెట్టుబడి కోసం బంధువులు, స్నేహితుల దగ్గర అధిక వడ్డీకి అప్పులు తీసుకొని ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. వ్యాపారంలో నష్టం రావడంతో రుణదాతల నుంచి ఒత్తిడి అధికమవడంతో, గత్యంతరంలేని పరిస్థితిలో మొత్తం ఐదుగురిని ప్రతివాదులుగా చూపిస్తూ తన న్యాయవాది ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

5 క్వింటాళ్ల గంజాయి పట్టివేత..?

దమ్మపేట, ఆగస్టు 19: మండల పరిధిలో ప్రత్యేక పోలీసులు భారీగా గంజాయి పట్టుకున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. రెండు రోజుల క్రితం దాదాపు ఐదు క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నా పోలీసులు మాత్రం వివరాలు వెల్లడించకపోవడం విశేషం. ఆంధ్రాలోని వైజాగ్ ప్రాంతం నుంచి డీసీఎం వ్యానులో సుమారు 5 క్వింటాళ్ల గంజాయిని హైదరాబాదుకు తరలిస్తున్నారనే సమాచారంతో కొత్తగూడెం సీసీఎస్ పోలీసులు గంజాయిని వ్యానును మందలపల్లి, అచ్యుతాపురం మధ్యలో పట్టుకున్నట్లుగా తెలిసింది. గంజాయి వాహనాన్ని కొత్తగూడెం తరలించారు. అయితే ఘటనకు సంబంధించిన పోలీసులు వివరాలు వెల్లడించలేదు. దమ్మపేట స్టేషన్ వద్ద మంగళవారం వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం


వంశీ(ఫైల్)

మధిరరూరల్, ఆగస్టు 19: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మధిర మునిసిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామ సమీపంలో జరిగింది. వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన కనకపూడి వంశీ(26) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 12గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మధిర నుంచి సిరిపురానికి బయల్దేరాడు. జిలుగుమాడు గ్రామశివారు వద్ద అతివేగంగా వెళ్తూ స్తంభాన్ని ఢీకొట్టాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ టీం దోర్నాల రామకృష్ణ, జ్యోతిలు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన వంశీని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.


పుల్లయ్య మృతదేహం


బోనకల్, ఆగస్టు 19: బోనకల్ గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లావాసి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మాచినేనిపాలెం గ్రామానికి చెందిన నలజాల పుల్లయ్య(69) గత నెలలో కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. వైద్య పరీక్షలు చేయించుకునే క్రమంలో తమ గ్రామం నుంచి బోనకల్ మీదుగా ఖమ్మంలోని ఆసుపత్రికి ద్విచక్ర వాహనం పై బయలుదేరాడు. బోనకల్ గ్రామ పంచాయతీ కూడలి వద్ద రోడ్డు దాటే ప్రయత్నంలో జగ్గయ్యపేటవైపునకు అతి వేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

ద్వి చక్ర వాహనాన్ని లారీ కొంతదూరం ఈడ్చు కెళ్లడంతో పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు రాగా బైక్ పూర్తిగా దగ్ధమైంది. మంటలను స్థానికులు ఆర్పివేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్...

పాల్వంచ, అగస్టు 19: రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన కుమార్ కన్హయ్య(50) మణుగూరు ప్రాంతంలో సీఆర్పీఎఫ్ క్యాంప్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పాల్వంచ కలెక్టరేట్ ప్రాంతంలో వ్యక్తిగత పని మీద వచ్చి పని పూర్తి కాగానే తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. బస్సు కోసం ఎదురు చూస్తుండగా, కొత్తగూడెం నుంచి పాల్వంచ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును చెయ్యెత్తి ఆపడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే బస్సు అదుపు తప్పి అతడిని బలంగా ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై రోడ్డుపై పడిపోయాడు. బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఖమ్మం రూరల్, ఆగస్టు 19: ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం పోన్నేకల్లు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం, జీళ్లచెరువు గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల మహేష్ (22) బోరు డ్రిల్లింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మహేష్ తన స్నేహితులు గోపి, నాగరాజు, నందిపాటి వినయ్‌తో కలిసి తన ద్విచక్రవాహనంపై మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డు నుంచి సోమవారం తెల్లవారుజామున జీళ్లచెర్వు వెళుతుండగా మార్గమధ్యలో పొన్నేకల్లు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్, నాగరాజుకు తీవ్రగాయాలయ్యాయి. వినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మహేష్ మృతి చెందాడు. నాగరాజు, వినయ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సంఘటనపై మృతుడి తండ్రి ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీవన్‌కుమార్‌కు డీఈగా ఉద్యోగోన్నతి



అభినందిస్తున్న ఉద్యోగులు

భద్రాచలం, ఆగస్టు 19: ట్రాన్స్‌కో మణుగూరు ఏడీఈగా, భద్రాచలం ఇన్‌చార్జ్ డీఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న జీవన్‌కుమార్‌కు సోమవారం డీఈగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ క్రమంలో ఆయనకు భద్రాచలం డీఈగా పూర్తిస్థాయి పోస్టింగ్‌ను ఇవ్వడంతో సోమవారం ఆయన అధికారికంగా రెగ్యులరు డీఈగా బాధ్యతలు స్వీకరించారు. మణుగూరు ఏడీఈగా ఆరు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించిన జీవన్‌కుమార్ భద్రాచలం డీఈగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో మూడు సంవత్సరాల రెండు నెలల పాటు పని చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఉద్యోగోన్నతి లభించడంతో బాధ్యతలు స్వీకరించగా ఏడీఈ వేణు, ఏఈ రాజారావుతో పాటు ఇతర సిబ్బంది జీవన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

మంత్రికి సమస్యల స్వాగతం

- నేడు అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి సమీక్ష
- ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

అశ్వారావుపేట, ఆగస్టు 19: చాలా కాలం తరువాత అధికారులతో నియోజకవర్గ సమస్యలపై మంత్రి స్థాయిలో మంగళవారం సమీక్ష జరుగుతుంది. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుంది. అశ్వారావుపేటలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఓ పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

- నియోజవర్గం ఏర్పడి 15 ఏళ్లు కావస్తున్నా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పడాల్సిన పోలీస్ డీఎస్పీ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ కార్యాలయంతో పాటు పలు ఇంజనీరింగ్, ఇతర డివిజన్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు కాలేదు.
- నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి అపరిష్కృతంగానే ఉంది.
- అశ్వారావుపేట పట్టణ వ్యాప్తంగ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు
- అశ్వారావుపేట పట్టణంలోని ప్రధాన సెంటర్ అయిన భద్రాచలం రోడ్డులో గోతులు తవ్వి వదిలేసిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు అపరిష్కృతంగానే ఉన్నాయి. వీటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది.
- ధరణి సమస్యలతో వేలాది మంది రైతుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ముఖ్యంగా పట్టణంలోని వేలాది ఎకరాలలో అసైన్‌మెంట్ భూములలో డబుల్ పట్టాలు సమస్య అధికంగా ఉంది. ఎంజాయ్‌మెంట్ సర్వేతో ఈ సమస్యను తీర్చాల్సి ఉంది.
- మండల పరిషత్, పంచాయతీలు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, విద్యుత్ శాఖ వంటి ప్రధాన శాఖలలో ఖాళీలు వేదిస్తున్నాయి.
- కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రానికి అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం నుంచి సరిపోయే బస్సు సౌకర్యం లేదు.
- దమ్మపేటలో కోర్టును ఏర్పాటు చేసినా జడ్జి లేక పోవడంతో కక్షిదారులకు తగు న్యాయం జరుగటం లేదు.
- నియోజకవర్గంలోని చిన్న తరహా ప్రాజెక్టులు మరమ్మతులు లేక శిథిలావస్థలో ఉన్నాయి. రైతులకు నీటిని అందించే పరిస్థితి లేదు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలసి ఉంది.
- పక్కా గృహాలు, రేషన్‌కార్డులు లేక వందలాది కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. 'డబుల్' ఇళ్లు పూర్తి అయినవి కూడ కేటాయింపులు జరుగక శిథిలమైపోతున్నాయి.



అశ్వారావుపేట పట్టణం

- నియోజవర్గంలో దాదాపు అన్ని గ్రామాలు జ్వరాలతో అల్లాడిపోతున్నాయి. పంచాయతీల్లో నిధులు లేక బ్లీచింగ్ కూడ చల్లడంలేదు. ఫాగింగ్ లేదు. వైద్యఆరోగ్యశాఖ మలేరియా ప్రభావిత ప్రాంతాలలో కూడ దోమలమందు పిచికారి చేయలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే జ్వరాలు మరింత విజృంభించే అవకాశాలున్నాయి.

నియోజకవర్గ అభివృద్ధిపై నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

- పలు ప్రారంభోత్సవాలు

అశ్వారావుపేట: రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి నియోజవర్గ అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం మధ్యాహ్నం 3గం.లకు పట్టణంలోని శ్రీశ్రీ కళ్యాణ మండపంలో జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి అధికారులతో ఈ సమీక్ష సమావేశం జరుగుతుందని తెలిపారు. మంగళవానం ఉదయం 11-30గం.లకు ములకలపల్లి మండలం మంగపేటలో పబ్లిక్ హెల్త్ సెంటర్, మధ్యాహ్నం 1గం.కు అశ్వారావుపేట మండలం నారాయణపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, 2గం.లకు వినాయకపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకులు, అధికారులు పాల్గొనాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

కొత్తగూడెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కలకత్తా ఆర్జికార్ మెడికల్ కళాశాలలో శిక్షణలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా డిమాండ్‌చేశారు. కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటరులో మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించి ఘటన జరిగిన ఆర్‌జీ కార్ కళాశాల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు దుగ్గిరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రత్నకుమారి, శ్రీనివాస్, కౌన్సిలర్లు దర్మరాజు, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, నూనావత్ గోవింద్, జహీర్, గోనెమణి, నేరెళ్ల రమేష్, ఖయ్యామ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

సుజాతనగర్, ఆగస్టు 19: సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ సంయుక్త మండల కార్యదర్శి భానోత్ ధర్మ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని పాత అంజనాపురంలో ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో గత ఎన్నికల్లో ఓటమి పాలైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడ ఎన్నికల హామీలను అమలుచేయడంలేదన్నారు. తక్షణమే సంక్షేమ పథకాలు ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి అర్హులైన పేదలకు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 22న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ కొత్తగూడెం డివిజన్ నాయకులు ఎం రాజశేఖర్, మండల నాయకులు ఎం పాపక్క, గ్రామ శాఖ కార్యదర్శి నాగభూషణం, నాయకులు కేశవరావు, కోర నాగమ్మ, ఎట్టి చుక్కమ్మ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో వైద్య శిబిరాలు

టేకులపల్లి, ఆగస్టు 19: మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాలల్లో వైద్యాధికారి దినేష్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పీహెచ్‌ఎన్ చంద్రకళ, సూపర్ వైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, హెల్త్ విజిటర్ కౌసల్య, రాంబాబు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ శైలజ, టి.హారిక, ఇంద్రజ, ధరణి, ఏఎన్‌ఎంలు వి.కమల, ఎం.సుజాత, వీరభద్రమ్మ, స్వప్న, వెంకటరమణ, సైదమ్మ, మానస, కళావతి, అనసూర్య, లక్ష్మీబాయి, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి వస్తువుల బహూకరణ

అశ్వారావుపేట, ఆగస్టు 19: అశ్వారావుపేట మండలం, వినాయకపురంలో ఉన్న శ్రీ యంత్ర రాజసహిత కాశేశ్వరస్వామి ఆలయానికి అశ్వారావుపేటకు చెందిన కట్టా రాంబాబు-నీరజ దంపతులు వెండి వస్తువులను బహూకరించారు. సోమవారం రాంబాబు దంపతులు ఆలయంవద్దకు వెళ్ళి ఆలయ ధర్మకర్త కుటుంబానికి 261 గ్రాముల వెండి పూజా సామగ్రిని అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్గీకరణ వ్యతిరేక బంద్‌ను జయప్రదం చేయండి

- ఎస్సీవర్గీకరణ వ్యతిరేక జేఏసీ నాయకులు సుందర్‌రావు

పాల్వంచ టౌన్, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న జరిగే దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బంద్‌లో మాలలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ నాయకులు వాసుమల్ల సుందర్‌రావు పిలుపునిచ్చారు. దమ్మపేట సెంటరులోని కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దారా చిరంజీవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలల భావిభారత పౌరుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ప్రతి ఒక్కరు బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి నాగేశ్వరరావు, వీరకుమార్, పెంకి శ్రీనివాసరావు, వెంకటరత్నం, కాల్వ రామారావు, రాధాబాబు, జి. శ్రీను, బాలస్వామి, శాంతివర్ధన్, నిశ్చిత పాల్గొన్నారు.

'ఎంపీవో సత్యనారాయణ సేవలు వెలకట్టలేనివి'

చుంచుపల్లి, ఆగస్టు 19: గుండెపోటుతో మృతి చెందిన ఎంపీవో గుంటి సత్యనారాయణ మండలంలో అందించిన సేవలు వెలకట్టలేనివని ఎంపీడీవో అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మృతి చెందిన ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మండల పరిషత్, ఈజీఎస్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్స్ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

గొత్తికోయలకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడాసామగ్రి అందజేస్తున్న సీఐ అశోక్

దుమ్ముగూడెం ఆగస్టు 19: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి మారుమూల అటవీ ఆవాసప్రాంతం గద్దమడుగు గొత్తికోయలకు సీఐ బొడ్డు అశోక్ సోమవారం క్రీడాసామగ్రి, సోలార్ దీపాలను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగించారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌ఐలు పోటు గణేస్, వెంకటప్పయ్య, సిబ్బంది ఉన్నారు.

ఎర్రబోరు బాధితురాలికి ఆర్థికసాయం

దుమ్ముగూడెం ఆగస్టు 19: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రబోరు అగ్ని బాధితురాలు ముర్రం లక్ష్మీకు రూ. 3500ల నగదును సాయంగా అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాదితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. లక్ష్మీ కుటుంబం నివాసం ఉండడానికి గ్రామస్థుల సహకారంతో రేకుల షెడ్డును నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వినీల్, మాజీ అధ్యక్షుడు అబ్బులు, కెల్లా శేఖర్, తెల్లం హరికృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి: డీపీవో



పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 19: వ్యాధుల సీజన్ నేపధ్యంలో పంచాయతీల్లో పారిశుధ్యంపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. మండలంలోని నారాయణపురం, వినాయకపురం పంచాయతీ భవనాలను మంగళవారం రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్న నేపధ్యంలో సోమవారం జిల్లా అధికారులు ఆయా పంచాయతీలను సందర్శించారు. నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను పరిశీలించి ప్రారంభోత్సవానికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయా పంచాయతీల్లో పారిశుధ్యంపై సూచనలు చేశారు. బ్లీచింగ్ చల్లటంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. డీపీవో వెంట డీఎల్‌పీవో రమణారావు, కార్యదర్శి సాయిబాబుతో ఇతర సిబ్బంది ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం: ఇఫ్టూ

పాల్వంచ టౌన్, ఆగస్టు 19 : కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి అన్నారు. సోమవారం నటరాజ్ సెంటరులో భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు వీరమల్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఇఫ్టూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ పర్మినెంట్ కోసం ఎన్నికల మ్యానిఫెస్టో అమలుకోసం కొట్లాడుదామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇఫ్టూ మణుగూరు, పాల్వంచ ఏరియా కమిటీ కార్యదర్శి గౌరి నాగేశ్వరరావు, నాయకులు ఎర్రం శ్రీనివాస్, మల్లేష్, వెంకన్న, రూప్‌సింగ్, రమేష్, బి. శ్రీనివాస్, ఎన్. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగాకు అస్వస్థత

మణుగూరు , ఆగస్టు 19: పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం అస్వస్థతకు గురై మణుగూరులోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు అడ్మిట్ అయ్యారు. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరం ఉండటంతో వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. రేగాకు టైఫాయిడ్ జ్వరం సోకినట్లు అనుచరులు తెలిపారు.

పీకే ఓసీ వెల్ఫేర్ అధికారి బదిలీ..

మణుగూరు, ఆగస్టు 19: మణుగూరు ఏరియా పీకే ఓసీ వెల్ఫేర్ అధికారిగా పనిచేసిన సినియర్ పీవో మదార్ సాహెబ్‌కు శ్రీరాంపూర్‌కు బదిలీ అయింది. సోమవారం ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి గౌడ్, తదితరులు మదార్ సాహెబ్ వీడ్కోలు సభను సంతోష్ నగర్‌లో శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో నిర్వహించారు. మదార్ సాహెబ్‌ను సత్కరించారు. ఆ తర్వాత మదార్ సాహెబ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డి నాసర్ పాషా, పికే ఓసీ రక్షణ అధికారి లింగబాబు, నూతన వెల్ఫేర్ అధికారి ఓంకారి బాపు, నాయకులు సిల్వేరు గట్టయ్య, అబ్దుల్ రవూఫ్, సారయ్య, అహ్మద్, మంగిలాల్, పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి మాతగా దర్శనమిచ్చిన పంచముఖ గాయత్రీ దేవి



మణుగూరు , ఆగస్టు 19: మండలంలోని గుట్ట మల్లారం గ్రామంలో గత పంచముఖ వేదగాయత్రీ దేవి అమ్మవారు సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని ప్రకృతి మత శాఖంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో ఎంతో సుందరంగా అలంకరించి తీర్చిదిద్దారు. అమ్మవారిని ఈ రూపంలో చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దయానిధి అక్కినేపల్లి వసంతాచార్యులు, ప్రదీప్ శాస్త్రి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఈయు రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 19: భారత్ సంచార్ నిఘాం లిమిటెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐబీడీపీఏ) రాష్ట కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెంలోని పెన్షనర్ భవన్ నందు ఖమ్మం యూనిట్ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పి.జయంత్‌రావు అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పలు తీర్మాణాలపై చర్చించి ఆమోదించారు. వాటిలో ముఖ్యంగా పెన్షన్ రివిజన్ వెంటనే అమలు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రాలలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసి సంబంధిత స్థానిక హాస్పిటల్స్ గుర్తించాలన్నారు. ఖమ్మం యూనిట్‌లో యూనియన్ ఇంకా బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో సర్కిల్ అధ్యక్షులు వీరస్వామి, ఈయు సర్కిల్ కార్యదర్శి సాంబశివరావు, నాయకులు తిరుమలచార్యులు, రఘురామ్, శ్రీనివాసరావు, ప్రవీన్‌కుమార్, బీఎస్.రావు, ఎస్.ఉపేందర్‌రావు, రాజేంద్రప్రసాద్, రజినికాంత్, ఏఐబీడీపీఏబీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నాయకులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ఈయూ రాష్ట్ర కార్యదర్శి

వైభవంగా శ్రీ వేంకటేశుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

పాల్వంచ టౌన్, ఆగస్టు 19: ప్రతి సంవత్సరం శ్రావణశుద్ధ పౌర్ణమి పర్వదినం (రాఖీపౌర్ణమి) సందర్భాన్ని పురస్కరించుకుని (గుట్ట) శ్రీనివాసగిరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశుని కల్యాణం సోమవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, అర్చకులు ఆరుట్ల పణి రాజాచార్యులు, అభిరామాచార్యుల ఆధ్వర్యంలో తెల్లవారుఝాము నుంచే ప్రత్యేక పూజలు, ఐగ్రీవ హోమం నిర్వహించి స్వామివారి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి దర్మపురిరాజు, సమన్వయకర్త ఊకే భద్రయ్య, తాటికొండ శ్రీత, జిన్నె రమేష్, బండి రాంజీ, సందీప్, చనుమోలు శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం

అశ్వారావుపేట, ఆగస్టు 19: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలులో పూర్తిగ విఫలమైందని తెలంగాణ రైతు సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు కె పుల్లయ్య విమర్శించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూడు దపాలుగ రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించినప్పటికి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ కాలేదని ఆరోపించారు. మండలంలోని 9 బ్యాంకులలో సుమారుగా 12వేల మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకున్నారని, ఇప్పటి వరకు వారిలో 3328 మందికి మాత్రమే రుణ మాఫీ అయ్యాయన్నారు. మార్గ దర్శకాలు, సాంకేతిక కారణాలపేరుతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైన రుణమాఫీ పూర్తి చేయకపోతే అందరిని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

భద్రాచలం, ఆగస్టు 19: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా నానమాద్రి సత్యనారాయణను నియమించినట్లు ఏటీఏ మండల అధ్యక్షుడు రేసు వెంకటేశ్వర్లు తెలిపారు. ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తు ఆదివాసీ సమాజ ఉద్యమ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ నాయకులు తెల్లం శ్రీనివాసరావు, కలం సత్యనారాయణ, కుంజా బక్కయ్య, ఎట్టి సీతారామమ్మ, సోడి శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్





కోనేరు చిన్ని, తుళ్లూరి బ్రహ్మయ్యకు రాఖీలు కడుతున్న దృశ్యం

నెట్‌వర్క్: రాఖీ పండుగ పర్వదినం సందర్భంగా కొత్తగూడెం బ్రహ్మకుమారీస్ అధ్యాత్మిక సంస్థ వారు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) స్వగృహంకి వెళ్లి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు, రాఖీ దుకాణాలు కిక్కిరిపోయాయి.



ఇల్లెందు మునిసిపల్ చైర్మన్‌కు రాఖీ కడుతున్న కార్మికులు



కొత్తగూడెంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాకు



జూలూరుపాడులో..



అశ్వారావుపేటలో..



పాల్వంచలో రాఖీ వేడుకలో తైక్వాండో క్రీడాకారిణి సింధుతపస్వి



మణుగూరు ఏరియా జీఎంకు రాఖీ కడుతున్న సేవా సభ్యులు



ఆళ్లపల్లిలో..

ఫొటోగ్రఫీ వృత్తికి గుర్తింపు కరువు

- కొత్తగూడెం ప్రముఖ ఫొటోగ్రఫీ నిపుణుడు కేసీఎస్‌రావు
- 50 ఏళ్లుగా 3500ల మందికి శిక్షణ





కొత్తగూడెంలో సేకరించిన కెమెరాలతో కేసీఎస్‌రావు, ఇల్లెందులో సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం

చుంచుపల్లి, ఆగస్టు 19: ఫొటోగ్రఫీ వృత్తికి ప్రస్తుత రోజుల్లో గుర్తింపు కరువైందని, తమ జీవితాలను గడుపేందుకు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని కొత్తగూడెం ఫొటోగ్రఫీ నిపుణుడు కేసీఎస్‌రావు అన్నారు. సోమవారం అంతర్జాతీయ ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా తాను సేకరించిన కెమెరాలను చూపుతూ ఫొటో గ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక చిత్రం ఎన్నో అర్థాలకు చిరునామా... ఒక చిత్రం ఒక సందేశాన్ని గతంలో ఉండేదన్నారు. అదేవిధంగా జరిగిన సంఘటనకు చిరునామాగా ... సాక్ష్యంగా..చిత్రంగా (ఫోటో) నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. 50 ఏళ్లుగా ఎన్నో కెమెరాలు సేకరించానని, 1505పైగా ఫొటో, వీడియో కెమెరాలు ఉన్నాయన్నారు. పాల్వంచలోని స్పాండ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ సంస్థలో ఉద్యోగిగా 1978లో విధుల్లో చేరి 2000ల సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొంది ఫొటోగ్రఫీలో సుమారు ఇప్పటి వరకు 3500ల మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫొటోగ్రఫీకి కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచిన నన్ను ఆదరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.